సాగర సంచిత

* కుమారి ఓగేటి ఇందిరాదేవి *



"లేఖా! లేఖా! అఖండుడల్లే వుండే ఆ కిశోర్. నీ వ్యాసానికి మళ్ళీ సమాధానం వ్రాశాడు చూడు..." శైలబాల మాటలింకా పూర్తికానేలేదు. ఒక్క ఉదుటున పత్రిక లాక్కొని కిశోర్ వ్యాసం చదవటం మొదలుపెట్టింది విద్యుల్లేఖ. ఆమె ముఖంలో క్షణక్షణానికీ ముదురుతున్న కోపారుణరాగాన్ని గమనిస్తున్నది శైలబాల. కాస్సేపటికి ఆ పత్రికను టేబిల్ మీదకు విసిరికొట్టి. "హుఁ, ఎలా వ్రాశాడో చూడు శైలా ఈ మహాశయుడు; కట్నాల సమస్య తీరకపోవటానికి స్త్రీలే కారణంట _ మతిలేకపోతే సరి," అంటూ మునిపంటితో క్రిందిపెదవిని బిగబట్టి ఆలోచనలో పడింది లేఖ.

శైలబాల గబగబా తెల్లకాయితాలూ, కలమూ తెచ్చి టేబిల్ మీద పెట్టింది.

"లేఖా! ఆ పురుషోత్తముడి గుండెలు ఝల్లుమనేట్లుగా సమాధానం వ్రాసి పడెయ్యి. నీ వ్యాసానికి అఖిలాంధ్ర స్త్రీ జనమూ జోహారు చేయాలి." అన్నది.

శైలబాల ముఖంలోకి అపేక్షగా చూసింది లేఖ. "శైలా—నీ ప్రోత్సాహమేగనక లేకపోతే..."

"ఊఁ, లేకపోతే?... మరేం పుట్టిము నగదుగాని తొందరగా వ్యాసం వ్రాయి;" నవ్వుతూ అక్కడినుంచి వెళ్ళిపోయింది శైలబాల.

"ఇదేమిటి లేఖా! ఇంకా వ్రాస్తూ కూర్చున్నావ్? తెల్లవారుజామునేగా మన ప్రయాణం," అంటూ హడావుడిగా వచ్చాడు సంపత్కుమార్.

"ఓ—నేను రెడీయే నబ్బాయ్. సర్దే బాధ్యతంతా మిస్ శైలబాలాదేవిమీదనే వేసుకుంది. నువ్వూ నేనూ ఆవిడగారు చెప్పినట్లు వినితీరవలసిందే." అంటూ వ్రాసుకోవటం కంటిన్యూ చేసింది లేఖ.

అసలు ఈ శైల చెవులు మెలెయ్యాల్సిందే.. పనులన్నీ తను చేస్తూ, నిన్ను కూర్చోబెట్టి వ్రాయిస్తూంటుంది," అంటూ శైలదగ్గిరికి వెళ్ళాడు సంపత్—మరి కాస్సేపటికి శైల గదిలోంచి వస్తున్న మధురమందహాసాల చిరునవ్వుడుల నాలకిస్తూ చిరునవ్వు నవ్వుకుంది లేఖ—ఈ ప్రయాణానికి గతమూ, అసలీ కథకు మూలమూ ఐన విషయ మేమిటంటే...

* * *

"పట్టాభిరామయ్యగారి కేమండీ బంగారు పిచ్చుక. సాక్షాత్తూ ధనలక్ష్మమ్మగారి భర్త. ఆయన దానధర్మాలు చేశాడంటే చెయ్యడూ మరీ. దానకర్ణుడిలాంటివాడంటే విడ్డూరమేముందీ—" అని విద్యుల్లేఖతండ్రిని పొగుడుతూ వుంటారు చాటునే. సార్థకనామధేయ విద్యుల్లేఖ—ఆర్ట్కాలేజీ విద్యార్థుల కళ్ళు మిరుమిట్లు గొల్పుతూ చదివి బియ్యేపరీక్షలు వ్రాసింది. ఆ పిల్ల కసలు పెళ్ళిచూపులంటే గిట్టదు. పెళ్ళంటే అంతకన్నా గిట్టదు—ఒక్కగానొక్క అన్నయ్య సంపత్కుమార్, బొంబాయిలో ఇంజనీరుగా ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి ధారాదత్తమైన వధువు శైలబాల—ధనలక్ష్మమ్మ పెద్దన్నయ్య కూతురు. వాళ్ళ వూళ్ళో కాలేజీ లేక పోవటంచేత కాబోయే కోడలిని తీసుకొచ్చి చదువు చెప్పిస్తున్నారు. బి. ఎస్సీ పరీక్షలు వ్రాసింది—చదువు లైపోయాయి గదా—ఇక ఒకేసారి ఇద్దరుపిల్లల పెళ్ళిళ్లూ చేయాలని పట్టాభిరామయ్యగారూ ఆయన సతీమణీ గట్టిగా నిశ్చయించుకున్నారు. కానీ ఈ విద్యుల్లేఖ పెళ్ళి వద్దంటుందాయె—ఆమె తల్లిదండ్రులకి ఇదొక్కటే బెంగ.

ఒకరోజున ఎన్నోవిధాల చెల్లెలికి నచ్చజెప్పాలని ప్రయత్నించాడు సంపత్కుమార్ అతని ఉపన్యాసాన్ని శ్రద్ధగా మౌనంగా విన్నది లేఖ.

"ఏమిటే లేఖా! మాట్లాడవ్? చెప్పు—

ఎందుకని చేసుకోవు పెళ్ళి? ఏం చేదు ష్యొయ్యాలసీ నీ భయం?" స్పష్టంగా కోపం ధ్వనించింది సంపత్ కంఠంలో.

అప్పుడు పెదవులు కదిలించింది లేఖ- "క్షమించన్నయ్యా! నాకు మగవాళ్ళని పెళ్ళిచేసుకోవటం యిష్టం లేదు-"

కోపమంతా మర్చిపోయి నవ్వాడు సంపత్. గడప అవతలగా నుంచుని వింటున్న శైలకూడా ఒక్కసారిగా ఇది విని ఫక్కుమంది. అతిప్రయత్నం మీద నవ్వాపుకొని "అయితే ఆడపిల్లను పెళ్ళిచేసుకోటానికే అభ్యంతరం లేదంటావ్. పత్రికల్లో ప్రకటన చేయిస్తానుండు..." అంటూ ఆగాడు.

"చదువుకు సరస్వతివి, డబ్బుకు శ్రీ మహాలక్ష్మివి, రూపానికి సాక్షాత్తూ రతీదేవివి, విద్యుల్లేఖవు - నిన్ను చేసుకోవడానికి మగధీరులు గాజులు తొడుక్కుని, వేషం మార్చుకుని రావడానికి వెనుదీయరు," అంటూ అందుకుంది శైలబాల.

'మిగతా విషయాలమాటెట్లావున్నా డబ్బునుచూసి ఆపని చేయగలరులే యువకులు,' అనుకుంది మనసులో విద్యుల్లేఖ.

"బలేవాళ్ళు తయారయ్యా రిద్దరూ నా ప్రాణానికి - ఒకళ్ళేదన్నా అంటే రెండోవాళ్ళు దానికి తందానతాన అనటమే. అంతనవ్వు యెందుకొస్తుందో మరి. ఉండండి, నాన్నతో చెప్తాను- మీకు అర్జెంటుగా పెళ్ళి చేసేయ్యమని - అదేగా మీకు కావలసింది. అప్పుడూ నన్ను చేసుకోమని బాధించరు - మరే - నాన్నా!...దీర్ఘం తీస్తూ, బుంగమూతి పెట్టుకుని తండ్రి దగ్గరికి వెళ్ళబోయింది లేఖ.

మా చిట్టితల్లికాదూ - మా బంగారు కొండకాదూ - నీ అమూల్యమైన అభిప్రాయముంది చూశావూ, దాన్నిమాత్రం నాన్నతో చెప్పకు. తనూ నవ్వుతారు. మా పెళ్ళి నువ్వు చెప్పకపోయినా చేసేస్తారు. కదూ శైలా!" కొంటెగా శైలముఖంలోకి చూశాడు సంపత్. చటుక్కున కళ్ళు వాల్చేసుకుని "ఏమిటా అల్లరిమాటలూ," క్రీగంటితో మందలించింది శైల.

ఆ రోజు సాయంకాలం శైలబాలా సంపత్కుమార్ ఇద్దరూ కలిసి చాలా సేపు సంప్రదించుకున్నారు విద్యుల్లేఖ వివాహం సంగతి. చర్చ పూర్తికాగానే "ఔనౌను బావా! అల్లాగే చెయ్యి. తన ఉద్దేశమదే అసలు. వాళ్ళతో కూడా మాటాడివుంచు." అన్నది సంతోషంతో శైలబాల.

"చిత్తం మరదలా!" అని, "నిజమే బాలా! కార్యేషు మంత్రీ కరణేషు దాసీ," అని వూరికే అనలేదు పెద్దలు.

ధర్మపత్ని గురించి అన్నారండీ పండితులవారూ ఆ మాట. మరదలి పిల్ల గురించికాదు," వేళాకోళంగా అన్నది శైలబాల.

"నిన్ను తొందరగా ధర్మపత్ని పదవిలో వుంచటానికే గదటోయ్ ఈ తాపత్రయం, ఈతహతహ. చూడుకావాలిస్తే నా గుండె కొట్టుకోవడం మానేసి, నీ నామమే జపం చేస్తోంది." అంటూ ఆమె నిగనిగలాడే చెక్కిళ్ళు అరిచేతుల్లో నిలుపుకోబోయాడు.

"అదుగో లేఖ_"

ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు.

"బోల్తాకొట్టారండీ ఇంజనీరుగారూ!" అందకుండా తప్పించుకుని పారిపోయింది శైలబాల.

* * *

ధనలక్ష్మి చిన్నతమ్ముడు విద్యాసాగర్, సంపత్ ఈడువాడే. బియ్యే పాసవగానే నౌకరీల జోలికి పోకుండా పల్లెటూరుకు వెళ్ళి వ్యవసాయం చేయిస్తున్నాడు_ విద్యాసాగర్ దేశభక్తుడు. వర్ణనలప్రియుడు. దూరప్రాంతాల్లోవున్న సంపత్కుమార్‌కు తరచుగా ఉత్తరాలు వ్రాసేవాడు. ప్రతిదాంట్లోనూ ఆ పల్లెటూరూ, పంటపొలాలూ, కొబ్బరితోటలూ, చల్లగాలీ, మల్లెపూలూ, కలువ రేకులూ మొదలైనవాటి వర్ణనలే. కొన్నాళ్ళిట్లా గడిచేసరికి సంపత్కుమార్ ఉండబట్టలేక పోయినాడుట. ఆంధ్రభూమిమీద రెక్కలు కట్టుకుని వాలి విద్యాసాగర్‌నూ ఆ పల్లెటూరునూ చూడాలని నిశ్చయించుకున్నాడుట.

"అదేమిట్రా అబ్బాయ్! హఠాత్తుగా వచ్చేశావేం? ఏమిటి విశేషం" అని అడిగిన తల్లిదండ్రులకు పై సమాధానమే చెప్పాడు సంపత్కుమార్.

"అమ్మయ్య! ఎన్నాళ్ళకింత మంచి బుద్ధి పుట్టిందిరా నీకు_ మన దేశ సౌభాగ్యానికి పట్టుకొమ్మలు గ్రామాలేరా!" అన్నాడు ముసలాయన.

"అన్నయ్యా! నాకు తెలుసులేను వ్వెందుకొచ్చావో? శైలబాలా దర్శనం కోసం ఉరకలు వేస్తూన్న మనస్సుతో వచ్చావుగదూ!" అన్నది విద్యుల్లేఖ అన్నయ్య చెవిదగ్గిర చేరి.

చెల్లెలి మాటలకు చిరునవ్వు నవ్వి "ఓసి కొంటెపిల్లా! ఏం తెలిసిందే నీ కప్పుడే_ పెళ్ళికొడుకుకోసం ఊరూ పల్లే తహతహలాడుతూ తిరిగినప్పుడు గానీ నాఈ ఆదుర్దా ఎట్లాంటిదో నీ కర్థం కాదు." అన్నాడప్రయత్నంగా సంపత్.

"అదుగో గుమ్మంలోకి వచ్చాడో లేదో 'పెళ్ళి పెళ్ళి' అంటూ ప్రారంభించాడు. ఇంతకు తప్ప ఇంకోమాటేలేదు;" విసురుగా అంటూ తన గదిలోకి పోయి తలుపులు బిగించుకుంది లేఖ.

* * *

అసంతా గుర్తుకొచ్చి నవ్వుకుంటూ "ఒకేదెబ్బకు రెండుపిట్టలు. 'ఏకక్రియా ద్వ్యర్థకరీ' అని అర్థం. రేపే మన ప్రయాణం_ లేఖతోగూడా చెప్పు. ఏం రాణీగారూ! తమ కిష్టమేనా?" స్నానం



చేస్తూన్న సంపత్ తువ్వాలు తెస్తూన్న శైలబాలమీద నీళ్ళు చిలకరించాడు.

"అబ్బ! ఆగు బావా! ఏవిఁటో ఆనందంలో మునిగిపోతున్నట్టున్నావ్? సంస్కృతంలో ఏవిఁటో బోధిస్తున్నారెవరికండీ ఇంజనీరుగారూ! అయ్యో! మీ కొంటెపని మూలంగా బఁగారం లాంటి నా చీరంతా తడిసిపోయింది గదా!"

"ఈ చుట్టుపట్ల కాకులూ కోకిలలూ కొండపిల్లలూ చాలా వున్నాయ్‌లే. వాటితో మాట్లాడుతున్నా - అయినా నేను నీళ్ళు చల్లుతూంటే విలాసంగా చెయ్యి అడ్డుపెట్టి 'హే ప్రభో! మోదకెస్త్రాదయ' అని వేడుకోవాలిగాని... ఛీ - నువ్వు నాకు తగినదానివి గావు బాలా!" గంభీరమైన పోజుపెట్టాడు సంపత్.

"నీకు చిన్నప్పుడు సంస్కృతం చెప్పించడంతో చిక్కొచ్చిందే బావా! బాబ్బాబు పండితమహాశయా! అన్నం చల్లారిపోతూంటి. ఇక చాలించండి తమ సంస్కృతమ్. అత్తయ్య ఏమేం చేశారో తెలుసా? మీ కిష్టమైనవన్నీనూ - కొబ్బరి పెరుగుపచ్చడీ.... మరేమో ఇంకా,.. అతన్ని ఊరించడానికి ఒక్క-క్షణం ఆగింది.

"పొరబాటు బేలా! నాకు అంతకంటే చాలా ఇష్టమైన మనిషి వుంది. ఆ మనిషి పేరేమిటో తెలుసా?"

"సరే. మీ రిక్కడే ఆ మనిషినే

తలుచుకుంటూ కూర్చోండి భావకవి గారూ! నేనక్కడ జిలేబీతోసహా అన్నీ స్వాహా చేసేస్తూంటాను.

"ఏయ్ పిల్లా ... ఓయ్ బాలా!"

వినిపించుకోకుండా లోపలికెళ్ళిపోయిందా బాల.

* * *

ఇదండీ జరిగినకథ – అనుకున్న ప్రకారం శైలా లేఖలతో కలిసి సంపత్కుమార్ పల్లెటూరికి ప్రయాణమయ్యాడు

* * *

ఒక్కకుదుపుతో వచ్చి ఆగింది – అప్పటికే స్టాండుదగ్గిరికి బండి కట్టించుకుని వచ్చాడు విద్యాసాగర్. ధోవతి కట్టుకుని, మోచేతులవరకూ మడుచుకున్న లాల్చీ తొడుక్కుని, జరీఅంచు ఉత్తరీయం వేసుకుని అచ్చాంధ్రపురుషుడిలా, బహు హుందాగా వున్న చిన్నమామయ్యను చూసేసరికి విద్యుల్లేఖ హృదయం ఉప్పొంగిపోయింది – "చిన్నమామయ్యా! నువ్వు ధన్యుడివి – దేశసేవ ప్రత్యక్షంగా చేయగల్గుతున్న కిసాన్‌వి," అనుకుంటూ గబగబా అతని దగ్గిరికి వెళ్ళింది లేఖ. ఆప్యాయంగా పలకరించాడు సాగర్. ఇంతలోకే సంపత్ శైలాకూడా అక్కడికి వచ్చేశారు.

ముందర సునాయాసంగా బండిలోకి దూకింది శైలబాల. ఆమెకు చిన్నప్పుడు పల్లెటూళ్ళో పెరిగిన అనుభవం బాగా వుంది.

"భద్రం బుల్లెమ్మా! చిన్నాన్నగార్ని చూసిన సంబరంలో కాలు బెణికేను." పరిహాసం చేస్తూ తనూ ఎక్కేశాడు సంపత్కుమార్.

"అమ్మబాబోయ్! చిన్నమామయ్యా! ఈబండి నెట్లా ఎక్కడం?" ఖంగారుగా అడిగింది లేఖ. "ఊc, మరే – కాలేజీల్లో అబ్బాయిల్ని ఏడిపించటంఅంత సులభమనుకున్నావా బండీ ఎక్కడం?" ముక్కు లెగరేస్తూ వెల్లెల్ని ఎక్కిరించాడు సంపత్. "ఏం భయం లేదమ్మా! చూడూ, ఈ చక్రంమీద కాలుపెట్టి ఇట్లాయెక్కు," అంటూ తను ఎక్కిచూపించాడు సాగర్. ప్రాణా లుగ్గబట్టుకుని రెండు అకులెక్కిందో లేదో చక్రం కొంచెం కదిలింది. కెవ్వుమంది లేఖ – క్రిందకు దిగుదామంటే భయం, పైకి యెక్కుదామంటే భయం. "ఏం ఫర్వాలేదు తల్లీ! నాచెయ్యి పట్టుకుని పైకిరా," అని చెయ్యి అందించాడు సాగర్." అమ్మయ్య! ఎట్లాగైతేనేం మామయ్య చెయ్యి ఆసరాతో బండిలో కొచ్చిపడింది – శైలా సంపత్‌లకీ పిల్ల అవస్థ చూస్తే పట్టశక్యం గాకుండా నవ్వొస్తున్నది – కానీ లేఖకింకా ఉడుకుమోత్తనం వస్తుందని అతి ప్రయత్నంమీద మొహాలు సీరియస్‌గా పెట్టు కూర్చున్నారు. మొత్తానికి ఒక పావుగంటసేపు 'శకటారోహణోత్సవం' జరిపింది విద్యుల్లేఖ.

మువ్వలు గంటలు గణగణ లాడగా

పరుగులు పెడుతున్నాయి ఎడ్లు — పరమ రమణీయమైన ప్రాతస్సంధ్యా వేళలో సుస్వచ్ఛమైన ప్రకృతి కాంత అందాలకు పరవశించిపోతూ కూర్చుంది లేఖ. ఒక గంట సేపటికి ఇంటికి చేరారు.

సుషుమ్న గబగబా ఒక కుర్చీ తెచ్చి బండిలోంచి దిగేటందుకు వీలుగా వేసింది. మనసులోనే చిన్నత్తకు వందన సహస్రా లర్పించుకుంటూ అందరికంటే ముందు తనే బండి దిగింది లేఖ —

"బావున్నావా లేఖా? పరీక్ష లెట్లా వ్రాశావు? ఇంతకీ మావూరు నీకేమన్నా నచ్చుతుందంటావా?" అంటూ వరస వరసగా ప్రశ్నలు కురిపించింది, సుషుమ్న — సుషుమ్న విద్యాసాగర్ ధర్మపత్ని — పదవి చేతనే కాక రూప సౌందర్యాది విశేషాల్లో, సద్గుణసంపదలో అన్నివిధాలా ధర్మపత్ని పదవాచ్యురాలు.

"పరీక్షలు బాగానే వ్రాశాను చిన్నత్తా! నేను చూసినంతవరకూ మీవూరు నాకు చాలా నచ్చింది — బాలసూర్యుడు ప్రసాదించే వెలుగులో కొత్త అందాలు ఒలకబోస్తున్న పచ్చని పంటపొలాల్ని చూసీ, ప్రతి యింట్లోనూ శ్రీమహాలక్ష్మల్లా దూడలతో సహా నిలిచివున్న గోమాతలను చూసీ, ముంగిళ్ళలో కళాపి చల్లి, ముగ్గులు పెట్టి, అలంకరిస్తున్న పల్లెపడుచుపిల్లల్ని చూసీ, నామనసు పులకరించిపోయింది. అంతా బాగానేవుంది కానీ ఈ యెడ్లబండి నెక్కటంమాత్రం... చాలాకష్టం."

"బావుంది — చాలా బావుంది. ఇహ ఈ అతిథులగతి పట్టించుకోరా యేమిటి ఇంటి ఇల్లాలుగారూ! కాస్త కాళ్ళు కడుక్కోవడానికి నీళ్ళు, గొంతు తడుపుకుని ప్రాణం నిలుపుకోవడానికి ఓకప్పు వేణ్ణీళ్ళు — ఏవీ యివ్వరన్నమాటే? ఈ కోడలుపిల్లగారి కవిత్వంలో పడితే అంతేగతి —" అంటూ ఉస్సురన్నాడు సాగర్.

చటుక్కున సిగ్గుపడిపోయి "ఇవిగో నండీ — బొక్కెనతో నీళ్ళు చెంబూ ఇక్కడే పెట్టాను. రండి, అందరూ కాళ్లు కడుక్కుని రండి. కాఫీ తెస్తాను," అని ఆహ్వానించి లోపలికి వెళ్ళింది సుషుమ్న.

ఇంటిచుట్టూ రకరకాల పూల మొక్కలూ, దొడ్లో కూరగాయల మొక్కలూ వేసి జాగ్రత్తగా పెంచుకుంటోంది సుషుమ్న. వేణ్ణీళ్ళతో స్నానాలు చేసి తయారై తీరిగ్గా ఆ పూలమొక్కల్ని పరికించటానికి వచ్చారు లేఖా శైలా. అప్పటికే విద్యాసాగర్ సంవత్కుమార్‌ని తీసుకెళ్ళాడు. తను వ్యవసాయంలో నూతనంగా అమలు జరుపుతున్న పద్ధతుల్ని చూపించటానికి. అక్కడ పొలం గట్టుమీద కూర్చుని వాళ్ళిద్దరూ చాలా సేపు సమాలోచనలు చేశారు. చివరకు చిరునవ్వులు నవ్వుకుంటూ "అలాగే చేద్దాం," అనుకున్నారు.

"మంగళం రుక్మిణీ రమణాయ శ్రీమతే, మంగళం రుక్మిణీమూర్తాయతే,"

అగరొత్తుల సువాసనలూ, శ్రీగంధపు ఘుమ ఘుమలూ, వీటితోపాటు శ్రావ్య కంఠంతో పాడే హారతీ - కలిసి ఇద్దరు కన్యల నాసికాశ్రవణకూపాల నాక్రమించేసుకున్నాయి. గబగబా వంట ఇంట్లోకి వెళ్ళారు. అక్కడి దృశ్యం వాళ్ళని ముగ్ధుల్ని చేసింది

నగిషీలు చెక్కబడి పసుపు కుంకుమ పచ్చని ఆకులతో, పూలమాలికలతో అందంగా అలంకరించబడి వుంది పూజా మండపం. అందులో శ్రీరామచంద్రుడు కోదండపాణియై, సీతాలక్ష్మణ సహితుడై, చిరునవ్వు చిందిస్తూ నిలిచిఉన్నాడు. ఆయన నుదుట కుంకుమ, మెడలో తులసి దళాలతో పువ్వులతో కట్టినమాల; చుట్టూ అత్యంత పవిత్రంగా వెలుగులు విర జిమ్ముతున్న దీపారాధన కుందులు.

నిండుగా బొట్టూ కాటుకా పెట్టుకుని ముడిలో ముద్దమందారపువ్వు తురుము కుని, లేత ఆకుపచ్చ నేత చీర కట్టుకుని, నల్లపూసలూ మంగళసూత్రాలతోపాటు పలకసర్లు పెట్టుకుని, గాజులు మధురధ్వ నులు సలుపగా మంగళహారతిస్తున్నది సుషమ్న— "అమ్మాయిలూ కళ్ళ కద్దు కోండర్రా హారతి," అంటూ వాళ్ళముం దుకు తెచ్చింది పళ్ళెం. నైవేద్యం పెట్టిన అరిటిపళ్లూ మామిడిపళ్ళూ కొబ్బరి ముక్కలూ తెచ్చి వాళ్ళకిచ్చి - మగవాళ్లు వచ్చేవరకూ ఆకలికి తాళలేరేమో - ఇవి తింటే ఆత్మారాముడు తాత్కాలికంగానైనా శాంతిస్తాడు." అన్నది.

ప్రసాదాన్ని భక్తిగా కళ్ళకద్దుకుంటూ "ఎవరివమ్మాయ్ నువ్వు - ఈ ఇంటికి లక్ష్మివా?" అని ఆర్టిస్టిక్‌గా ప్రశ్నించింది లేఖ. "ఔనమ్మా! నేను గృహ లక్ష్మిని - మా యింటి కొచ్చావు గనుక నీకూ శుభా లిస్తాను." అంటూ నవ్వింది సుషమ్న - మిగిలిన పిల్ల లిద్దరూ శ్రుతి కలిపారు.

మామా అల్లు ళ్ళిద్దరూ ఇంటికి రాగానే అందరికీ కలిపి భోజనాలు వడ్డించేసింది సుషమ్న. శైల లేఖలను ఒక్కపనికూడా ముట్టుకోనివ్వడంలేదు. వేయించి వండిన కందిపప్పూ, దొడ్లో కాసిన వంకాయకూరా, ఘుమఘుమలాడే నెయ్యీ, ములక్కాడల పులుసూ, మీగడ పెరుగూ, మామిడిపళ్ళూ, పరమాన్నం - ఇవీ అనాటి భోజనపదార్థాలు. సగం భోజనం చేసేటప్పటికే అలిసిపోయారు అతిథులు. వీటికితోడు మధ్యాహ్నం ఒక నిద్రపోయి లేచాక అరిసెలూ బజ్జీలూ పనసతొనలూ పెట్టి కాఫీ యిచ్చింది సుషమ్న. "బాబోయ్! ఇహ సాయంత్రము అన్నం తినలే" మని అతిథులు గోలపెట్టేశారు-'అదేం కుదరదండీ' అని పట్టణవాసులను సుషమ్న మందలించింది. కన్నెపిల్ల లిద్దరూ సుషమ్న దగ్గిర చేరి గచ్చకాయలాడటం నేర్చుకుందామని వ్యర్థ ప్రయత్నం చేస్తున్నారు.

"ఏరా! నువు ఇందిరను తీసుకొని పారిపోయినప్పుడు ఆపిల్ల నాయన నీవెంట పడ్డాడటగా!"

"ఊరికే వెంట పడటంతో ఆగాడా! ఇంకా ఇప్పుడుకూడా మా యింటోనే వుంటున్నాడు."

ఇంతలో వాకిట్లోంచి కేకేశాడు సుబ్బడు-"అమ్మగోరూ! ఇయిగో మల్లెపూలు కోసుకొొచ్చి కుప్పపోసినా ఈడ." అని. ఆ మల్లెపూలరాశిని చూసి గంతులు వేశారు శైలా లేఖలు.

పోడుగాటి చీపురుపుల్లలు తెచ్చి లేఖ జడ కొలుస్తూ "అన్నపూర్ణమ్మపిన్నిగార్ని పిలిచాను పూలజడ వెయ్యటానికి. శైలబాలకు రేపు వేస్తాం...అదుగో మాటల్లోనే వచ్చేసారే పిన్నిగారూ! రండి," అంటూ గౌరవంగా ఆహ్వానించిం దావిడని సుషమ్న -

"లేఖంటే ఈ పిల్లేనా? చక్కటి జుట్టుంది. పూలజడేస్తే కనులపండువుగా వుంటుంది;" మురిసిపోతున్నట్లుగా అన్నది అన్నపూర్ణమ్మగారు.

"నాకొద్దు బాబోయ్ ఇంత పెద్ద దానికి జడేమిటి?" ఖంగారు పడింది లేఖ.

"ఇప్పుడే తల్లీ వేసుకోవాల్సిన వయస్సు - పూలజడంటే భయ మేమిటీ మీ బస్తీపిల్లలికి?" అన్నది అన్నపూర్ణమ్మగారు - "మరే - లేఖా! పిన్నిగారు జడేస్తేనే ఠక్కు-మని పెళ్ళైపోతుంది." అని అసలు సంగతిని విడమరచింది సుషమ్న.

"అయితే అసలే జడేయించుకోను." అని పెంకెగా అనబోయి, ఆ అన్నపూర్ణమ్మగారిని చూసి యుడిసి మాట్లాడలేదు లేఖ.

"ఔనమ్మా లేఖా! మీ చిన్నత్త స్వానుభవంలే అది. క్రిందటి యెండా కాలంలో సుషమ్నను విద్యాసాగరం

చూడడానికి వచ్చినరోజున జడేసింది నేనేలే," అంటూ నోటినిండుగా నవ్వుతూ లేఖ జడవిప్పటం మొదలుపెట్టింది అన్న పూర్ణమ్మగారు - సన్నటి సిగ్గుతెర కద లాడింది సుషమ్న ముఖంలో.

జడ పూర్తి కాగానే ఎగాదిగా నాలుగు సార్లు విద్యుల్లేఖను పరికించి "పిన్ని గారూ! మా లేఖకు పూలజడతో చాలా అందం వచ్చింది కదండీ," అన్నది సుషమ్న.

"ఏమో, నాకట్లా అనిపించటల్లేదు."

విస్తుపోయి ఆవిడవంక చూసింది సుషమ్న.

"మీ లేఖవల్ల ఆ పూలజడకే అందం వచ్చింది," అంది అన్నపూర్ణమ్మగారు.

"భలేవారండీ మీరు," అంటూ సుషమ్న నవ్వింది. "లేఖా! ఈ ఒక్క పూటకీ నా అభిమతం ప్రకారం తయా రవ్వాలి నువ్వు - శైలా! ఆ అలంకార సామగ్రినంతా లేఖకు చూపించు." అన్నది.

శైలబాల లేఖ చెయ్యి పుచ్చుకుని గబ గబా తీసుకెళ్ళిం దక్కణ్ణుంచి. అభిప్రా యాలు కనిపెట్టటంలో శైల అద్వితీయ మైన ప్రజ్ఞ గలది.

అన్నపూర్ణమ్మగారూ సుషమ్నా ఏమిటో నెమ్మదిగా మాట్లాడుకుని నవ్వు కుంటున్నారు.

ఇంతలో విద్యుల్లేఖ ముస్తాబుతో ప్రవేశించింది. శైలబాల ఇంకా తయా రౌతోంది లోపల.

సన్నని జరీ బార్డరున్న గోధుమ రంగు పట్టుచీర కట్టుకుని అంచురంగుతో మెరిసిపోయే ఆకుపచ్చని పట్టు జాకెట్ వేసుకుని మధ్య మధ్య పచ్చలు పొదిగిన మూడుపేటల ముత్యాలనెక్లెస్ పెట్టుకుని తయారైన విద్యుల్లేఖను కన్నార్పకుండా చూశారు ప్రేక్షకు లిద్దరూ.

ముందు సుషమ్నే తెప్పరిల్లుకుని "లేఖా! కొత్తచీర కట్టుకున్నావుగదా! ముందు పెద్దముత్తైదువ అన్నపూర్ణమ్మ గారికి నమస్కారం చెయ్యి," అన్నది.

తనకు వంగి నమస్కరించిన విద్యు ల్లేఖను చూసి సంతృప్తితో పొంగి పోయిం దావిడ. "శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు - పుత్రపౌత్రాభివృద్ధిరస్తు," అని దీవెనలు కురిపించి లేఖను లేవనెత్తి చెక్కిళ్ళు పుణికింది.

కాస్సేపటికి వూరి సంచారానికి వేం చేసిన సాగర్ సంపత్‌లు ఊడిపడ్డారు. "సుషూ! అంతా రెడీయేనా?" అంటూ హడావుడిగా ప్రశ్నించాడు సాగర్.

"ఓ - అంతా రెడీ - అదుగో చూడండి మందారచెట్టుదగ్గిర నుంచున్న మీ అక్కగారి కూతుర్నీ. అన్నగారి కూతు ర్నినూ," అంటూ చూపించింది సుషమ్న.

"ఇంతకూ మా అక్కయ్య అదృష్ట

వంతురాలు. బంగారంలాంటి కూతురూ..."

ముఖం తుడుచుకుంటూ వచ్చిన సంపత్ అందుకున్నాడు — "ప్లాటినమ్ లాంటి కోడలూ..."

"సాగర్ మళ్ళీ అందుకుని వాక్యాన్ని పూర్తి చేశాడు. "రత్నంలాంటి కొడుకూ దొరికినందుకు."

"అసలువాళ్ళగురించి ఏమీ అనరే," మనుకుంది సుషమ్న — "తొందరగా తయారవ్వండి మీరూనూ," అంటూ భర్తను లాక్కుపోయింది.

సంపత్కుమార్ మందారచెట్టుదగ్గిరికి వచ్చాడు. చెల్లెలికి చెప్పొద్దని సైగ చేసి పొడుగాటి శైలజడను పక్కనున్న చెట్టుకు సున్నితంగా ముడివేస్తున్నాడు. లేఖకు నవ్వు ముంచుకొచ్చింది. తీరిగ్గా నవ్వుకుందామని ఇంట్లోకి పరుగెత్తింది. కానీ కించిత్తు భేదంగా అక్కడి పాఠాన్నే పఠిస్తున్నారు సుషమ్నా సాగర్లు. అందుకని వాకిట్లో వున్న కుర్చీలోనే కూలబడి నవ్వుకోబోయింది.

ఇంతలోకే గంభీరమైన కంఠంతో "సాగర్ ఉన్నాడాండీ?" అనే ప్రశ్న విన్పించింది.

ఉలిక్కిపడి "ఆఁ — వున్నాడు. పిలుస్తాను. మీ రిక్కడ కూచోండి — అంటూ కుర్చీ ముందుకు నెట్టింది. అతడు ఒక్కక్షణం కనులు కుంచించీ, మరుక్షణం కళ్ళు విప్పార్చీ లేఖవైపు చూశాడు —

"అబ్బ!. చాలా అందంగా వున్నాదే - ఈ పల్లెటూళ్ళో ఇత దెక్కణ్నుంచి వచ్చాడో!" అనుకుంటున్న విద్యుల్లేఖ అతని చూపులకు షాక్ కొట్టినట్లయిపోయి, "ఊఁ. కూచోండీ-" అని చిన్నగా గద్దరించి సాగర్ను పిలవటానికి లోపలికి వెళ్ళబోయింది. ఇంతలో వాకిట్లోకి రానేవచ్చారు సుషమ్నా సాగర్లు — "ఎవరినమ్మా లేఖా, కోప్పడుతున్నావ్?" అంటూ.

ఆ వచ్చిన యువకుణ్ణి చూసి, "ఓరి కిశోర్; ఇప్పుడేనా రావటం - కులాసానా? వగైరా వగైరా కుశలప్రశ్నలన్నీ వేస్తూ సుషమ్నవైపు తిరిగి "ఇతను నా ప్రాణస్నేహితుడు కిశోర్. మన పెళ్ళికి రాలేదు. ఎమ్మే ఫస్ట్క్లాసులో ప్యాసై కాలేజీలో వుద్యోగం చేస్తున్నాడు. లెక్చరరుగా. కాస్త జాగ్రత్తగా సత్కారం చెయ్యి. లేకపోతే ఏదో వ్యాసం రాస్తూ మనల్నికూడా దుయ్యబడతాడు." అని పరిచయం చేశాడు. నమస్కార ప్రతి నమస్కారా లయ్యాయి. "రా లేఖా! నా మిత్రుణ్ణి పరిచయం చేస్తాను," అని లేఖను పిలిచి "ఈమె మిస్ విద్యుల్లేఖ - మా అక్కయ్యగా రమ్మాయి. పురుషుల దౌర్జన్యాలను గూర్చి ఘాటుగా వ్యాసాలు వ్రాసేస్తూంటుంది — బియ్యే పరీక్షలు వ్రాసింది." అని పరిచయం చేశాడు. సాగర్ కనుతుదలు హాసరేఖలతో ఉక్కిరిబిక్కి రౌతూండగా.

"అట్లాగా - ఈ వింతపేరు నాకు సుపరిచితమేనే!" స్వగతంలో లాగా అనుకున్నాడు కిశోర్. మరునిముషంలో ఆ యువతీ యువకుల కళ్ళల్లో ఏదో చిత్రమైన భావం కదలాడటం గమనిస్తూ నవ్వుకున్నారు సుషమ్నా సాగర్‌లు.

'వరకట్న పిశాచి' అనే వ్యాసంమీద విమర్శలు వ్రాస్తున్నది మీరేనా? అతన్ని పరిశీలనగా చూసి సూటిగా ప్రశ్నించింది విద్యుల్లేఖ.

"ఇంతకీ 'వ ర క ట్న పిశాచిని' వ్రాసింది మీరేనా?" మహా కుతూహ లంగా అడిగాడు కిశోర్.

అప్పుడే వచ్చిన శైలబాల చప్పట్లు కొట్టేసింది. అంతా అర్ధమైపోయింది చుట్టూ వున్నవాళ్ళందరికీ.

"ఏమిటీ! ఐతే విద్యుల్లేఖా కిశోర్‌లు పూర్వపరిచయం కలవారే నన్నమాట;" అని ఆశ్చర్యపోయారు సంపత్కుమార్ విద్యాసాగరులు.

మామిడిపండు ముక్కలు త రి గి ప్లేట్లో పెట్టుకుని తీసికొచ్చింది సుషమ్న, "తీసుకోండి రచయితగారూ!" అంటూ.

"అమ్మో! ఎదురుగుండా రచయిత్రిగా రున్న సంగతి మరచిపోవద్దండోయ్_" అంటూ ఆ ప్లే టందుకున్నాడు కిశోర్.

ఆరుగురూ కలిసి విద్యాసాగరుగారి మల్లెతోటకు బయల్దేరారు. వీళ్ళని మన్మ ధుడి బాణాల్తో పోల్చడానికి వీల్లేదు. అవి అయిదే. వీళ్ల ఆరుగు రున్నారు మరి. విద్యుల్లేఖా సౌందర్య వాహినిలో మునకలు వేస్తూ నడుస్తున్నాడు కిశోర్. ఏతత్సౌందర్యాస్వాదనలో సహస్రాక్షు డై పోయాడు.

'ఎంతపెద్దది తోట!' దాన్ని చూస్తూనే మహాశ్చర్యపోయారు అతిధులు. ముందర ఫలభరితాలైన సపోటాచెట్లు, మామిడి చెట్లు తలలు వంచి స్వాగత మిచ్చాయి వాళ్ళకి. నిమ్మ నారింజ పనస ద్రాక్షలు ఆహ్లాదంగా పలుకరించాయి. ఆ తర్వాత ఉన్నదే మల్లెతోట. మధురమైన సాయం సంధ్యలో మల్లెపూలమీదినుంచి వీచే ఆ సౌరభాన్ని మోసుకొస్తూ ఆయాసపడు తోంది మలయానిలం. అందుకే అంత మందంగా వీస్తోందది. సూర్యభగవానుడు తన తీక్ష్ణతాపాన్ని పరిహరించుకుంటు న్నాడు. ఆ వేళలో, ఆ తోటలో, ఆ స్థితిలో సంధ్యారమణీయమైన ప్రకృతి సౌందర్యానికి పరవసించి పులకరించి పోయింది లేఖాదేవి మధుమయ హృద యము. త్వరత్వరగా ముందుకు నడి చింది. గులాబీలు నందివర్ధనాలు మందా రాలు సన్నజాజులు సంపెంగలు మల్లెలు అన్నీ చల్లగాలికి తలలు వూపూతూ ఆహ్వా నించాయి విద్యుల్లేఖను. ఆమెనుకూడా ఒక పూబాల అనుకున్నా యవి.

విచ్చీవిచ్చని తెల్లనిమల్లెపూవులతో, నయానానంద సంధాయకమై, త రు ణి చిరునవ్వులా వుంది తోట. దానిమధ్యన ఆధునికంగా తయారుచేయబడిన పూల



పొదరిల్లు. ఆ పూలపై అసంఖ్యాకంగా వాలివున్న తేనెటీగలు ఝుమ్మని లేచి ఆ తోటలోనే వున్న తమతమ పెట్టెల్లోకి వెళ్ళిపోతున్నాయి.

"తేనెపెట్టెలుకూడా పెట్టావే! తేనె తియ్యటం వచ్చునన్నమాట. ఈ తోట అంతా చాలా బావుంది. ఎంత కళామయ హృదయమోయ్ నీది," అని మెచ్చుకున్నాడు కిశోర్ సాగర్ని. ఇదంతా నా ప్రయోజకత్వమే అనుకుంటున్నావా మిత్రమా! కాదు బాబూ! అంతా ఇంటావిడగారి ప్లానే. ఎటొచ్చీ ఆవిడగారి ఆజ్ఞానిర్వాహకుణ్ణే నేను," అన్నాడు సాగరు చిలిపిగా.

కోపంగాచూసింది సుషుమ్న భర్తవైపు.

ఆ పొదరింటి పేరు పూలపల్లకి - ఆరుగురూ అందులో కూచుని సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు - తోటకాపరి వెంకన్న పనసతొనలూ చెరుకుముక్కలూ అరిటాకుల్లో పెట్టి తెచ్చాడు - కొబ్బరి బొండాలు పగలకొట్టి నీళ్ళిచ్చాడు.

"అమ్మగోరూ! మాంచి నేతతాటికాయలు కొట్టుకొత్తా రేపు — మరి ఇస్త్రీ దొరలు తింటారా?" అని అడిగాడు సుషుమ్నను.

"ఓ యస్ - మేము రెడీ - ఏవి తినటానికైనా - పెడుతూండటమే మీపని," అన్నాడు సంపత్ నవ్వుతూ.

తోటను పరిశీలనగా చూసివస్తామని వెళ్ళారు జంటలు రెండూ చెరొక

వైపుకూ - వెంకన్న మాత్రం లేఖమ్మ గోర్ని విడిచిపెట్టకుండా కళ్ళురేసుకుని కూచున్నాడు. అతని భావాల్లోని నైర్మ ల్యాన్నీ - మాటల్లోని యాసనూ గమ విస్తూ అప్పుడప్పుడూ ఊఁ కొడుతోంది లేఖ.

"మరండీ-శశిరేఖమ్మగోరూ! ఇంక రెండుమూడ్రోజుల్లో మన నల్లావు ఈను ద్దండీ-ఇంక చూస్కో నా సామిరంగా!" అన్నాడు వెంకన్న సంబరంగా.

'నల్లావు ఈనితే నాకంత ఒరిగే దేమిటో,' ననుకుంటూ ప్రశ్నార్థకంగా చూసింది లేఖ.

ఈసారి రేఖమ్మగారివైఖరికి వెంకన్న చాలా దిగులుపడ్డాడు. "భలే జున్నండీ దానిది - మన సుసుమనమ్మగోరు వండితే ఇంకా బావుంటది," అన్నాడు.

"అహా - జున్నంటే నాకు చాలా యిష్టం." అంది లేఖ. వెంకన్న ముఖం చేటంతైంది.

"తాగ లెప్పుడైనా భోంచేశారా దొరసానమ్మగోరూ? రేపటాల మాంచి పాకంలో కాల్చి తవఁకు రుచిచూపిస్తా నుండండి," అన్నాడు.

"ఇంకా సేపటికి జొన్నంబలి తిన్నారా? సీమచింతకాయలు తిన్నారా? అనికూడా అడుగుతాడు వెంకన్న. నిజా నికి అసలు రుచిగల పదార్థాలు అవ్వే అనుకోండి. కానీ మీలాంటి సుకుమా రులు..." అని అర్థ...

వెనకాలే నుంచున్న కిశోర్.

గిరుక్కున వెనక్కి తిరిగి "మీ రిక్కడే ఉన్నారే?" అంది వ్యంగ్యంగా.

"మరి యెక్కడుంటా ననుకున్నారు? ఇటువేపు మీ అన్నా వదినా అటువేపు మీ చిన్నమామయ్యా చిన్నత్తయ్యా తోట చూడ్డానికట వెళ్ళారు. నేను ఏ జంటవెనక వెళ్ళను చెప్పండి. మీరేమో నాతో మాట్లాడకనేపోతిరి. మీ దగ్గిరిగా కూర్చుని వెంకన్న మాటలైనా విందా మంటే మీరు కోప్పడతారేమోనని భయ మేసింది. అందుకనే ఇంతదూరంగా నుంచుని వింటున్నాను;" చిలిపిగా నవ్వాడు కిశోర్.

లేఖకు అత న్నేమనాలో తోచింది గాదు - కాస్సేపు ఆలోచించింది. 'వర కట్న పిశాచి'ని గూర్చి మాట్లాడదా మనుకుంది. అతనంత దురుసుగా ఎందుకు వ్రాశాడో అడగాలని ప్రయ త్నము.

ఇంతలోకి అతనే అడిగేశాడు - 'నా మీద కోపమా?' అని.

మృదుస్వరంతో ఆ కంఠంలో ఒలి కిన లాలిత్యానికి అదోలా అయిపోయింది లేఖ. తను ఎందుకలా అయిపోతోందో అర్థంగాకముందే "ఛ - ఛ - కోప మెందుకూ?" అంది ప్రసన్న ముఖంతో, ఆకర్షణా ప్రవాహంలో కొట్టుకుని



పోతున్న మనస్సుని ఎదురీది తెచ్చుకోవాలని ప్రయత్నిస్తూ.

"అయితే అదృష్టవంతుణ్ణి."

తనకు తెలియకుండానే సిగ్గుపడింది లేఖ. "ఏమండీ – ఇంత మంచివారుగదా మీరు; ఆ వ్యాసా లట్లా వ్రాశారేం?" అని అడిగి చటుక్కున నాలిక కొరుక్కుంది. కాకపోతే ఎవరో ముక్కూ మొహం ఎరుగని పురుషుణ్ణి – అందులో తన ప్రతిస్పర్ధిని పట్టుకుని 'మీరు మంచివాళ్ళు' అనట మేమిటీ అని.

ఇది గ్రహించిన అతగాడి అధర బింబాలపై క్షణకాలం చిరునవ్వు వెన్నెల చిందులాడింది.

"ఇంతకూ నేను మంచివాణ్నేగదా – పోన్లెండి – మీరు వ్రాసిన వ్యాసాన్ని బట్టే జవాబుకూడా వ్రాశాను – 'పురుషులందరూ డబ్బుకు బానిసలే – ఏ మగవాడికీ విశాలదృక్పథం లేదు – స్త్రీల నేడిపించటమే వాళ్ళపని' అని. మమ్మల్నందర్నీ కలిపి తీవ్రాతి తీవ్రంగా దుయ్యబట్టలేదూ మీరుమటుకు – అక్కడికి మీ ఆడవాళ్ళంతా మంచివాళ్ళయినట్లు!" ఉద్వేగంగా అన్నాడు కిశోర్.

"ఇప్పటికీ నా నమ్మకం అదే. చేతనైతే కాదని నిరూపించండి చూద్దాం. కట్నం వద్దనే సహృదయుణ్ని నే నింత వరకూ చూడలేదు వినలేదు!" లేఖ దృఢ స్వరంతో సమాధానం చెప్పింది.

"అట్లాంటి సహృదయు లున్నారని

నేను నిరూపిస్తాను. అంగీకరిస్తారా? నేనే మీకు నిదర్శనంగా నిలుస్తా నని ప్రతిజ్ఞ చేస్తున్నాను. సరేనా!'' ఆవేశంగా అన్నాడు కిశోర్.

"ఊరికే ఆడపిల్లల దగ్గర ఉపన్యాసాలు దంచటంకాదు; ఉట్టుట్టి ప్రతిజ్ఞలు చెయ్యటమూకాదు. ఋజువు చేసిననాడు. అప్పుడూ...''

"ఊఁ. అప్పుడూ? అప్పు డేం చేస్తారు మీరు? దాసోహ మంటారా?" ఒళ్ళు తెలియని ఆవేశంలో ఆమె చెయ్యి పట్టుకుని అడిగాడు.

కిసలయ సుకుమారమైన ఆ జవరాలి చేయి నలిగిపోయింది. గబుక్కున చెయ్యి ఇవతలకు లాక్కుని ఒక్కవిసురున వెనక్కి తిరిగింది విద్యుల్లేఖ - ఆమె పూలజడచివర పెట్టిన బంగారపు జడకుచ్చులు 'మా యజమానురాలి చేతికింత కష్టం కలిగిస్తావా?' అని మందలిస్తున్నట్లు సుస్మితంగా అతని చెక్కిలిని స్పృశించి త్రుటికాలంలో మాయమైనాయి.

ఇదంతా వ్రాయడాని కింత సేపు పట్టిందిగాని క్షణంలో జరిగింది. జడకుచ్చుల మందలింపుతో ప్రకృతిస్థుడైనాడు కిశోర్. తన ఆవేశానికి సిగ్గుపడ్డాడు

విద్యుల్లేఖ కాస్త దూరంగా నుంచుని "అప్పుడా? అప్పు డేం చేస్తానో చూద్దురుగా). మి పెళ్ళిరోజుదాకా ! పిత కొండవీటి చేంతాడంతపొడుగున పెళ్ళి

పట్టండి. అస లందాకా వస్తేగదా-మాట తప్పుతాననే భయంమాత్రం మీ కక్కర్లేదు. మీ పెళ్ళికి పిలవండి మరి నన్ను-హుఁ సిరిరా మోకా లొడ్డు మగవాడు ఉంటాడేమో చూడాలని నాకూ కుతూహలంగా వుంది - అయినా ఇంత ఆవేశ పరులేమిటండీ మీరు! ఉచితానుచితాలు కూడా మర్చిపోతే ప్రమాదంసుమా!'' శాంతంగా అన్నది విద్యుల్లేఖ.

"క్షమించండి," అంటూ మందహాసం చేసి "మనిద్దరికీ వైరమైనా మనచేతులకు మాత్రం సఖ్యమేనండోయ్," అదుగో మీ అన్నయ్యావా శ్వాస్తున్నారెండి," అన్నాడు కిశోరుడు.

*　　*　　*

నగరంలోని ఇంటికి తిరిగి వచ్చేశాక మరిచిపోదా మనుకుంటూనే కిశోర్ ప్రతిజ్ఞను గురించి ఆలోచిస్తోంది విద్యుల్లేఖ-"నిజంగా - అతను కట్నం లేకుండానే పెళ్ళి చేసుకుంటాడా? ఏమో చూడాలి. అతని భార్య యెట్లా వుంటుందో? ఎట్లా వుంటే నా కెందుకులే అని సరిపెట్టుకోబోయేది. మళ్ళీ కాస్సేపటికి, "ఏ ధనవంతుల ఏకైక పుత్రికనో పెళ్ళి చేసుకుంటాడేమో - వేరే కట్న మెందుకూ? అప్పుడు ఆస్తంతా తనదే ఔతుంది," మళ్ళీ ఆలోచన లతనిమీదకే మళ్ళేవి.

తల్లీ దండ్రీ యెంతో బలవంతపెట్టి, లేఖను పెళ్ళిచూపులకు ఒప్పించారు.

కొడుక్కూ— పెళ్ళికీ సంబంధించిన షరతులన్నీ ఏకరువుపెట్టి వీటికి మీ రంగీకరిస్తేనే పెళ్ళిచూపులకు ఒప్పుకుంటానన్నది. 'సరే' నన్నాడు తండ్రి — పెళ్ళికుమారుడిగురించి షరతులు పెడుతున్నప్పుడు ఆ యువతి హృదయంలో సుపరిచితుడైన ఒకపురుషమూర్తి స్నిగ్ధమధురమందహాసంతో నిండిపోయి వున్నాడు. కానీ ఆమె దాని అర్థాన్ని ఇదమిత్థంగా తెలుసుకోలేకపోతోంది. మనస్సులో మాత్రం అశాంతి. శైలబాల ఈ మనిషి అవస్థ చూసి నవ్వుకుంటూ సుషమ్నకు ఉత్తరం వ్రాసి పడేసింది.

సాదావాయిల్ చీర కట్టుకుని రోజూ కంటే నిరాడంబరంగా తయారై తన గదిలో కూర్చుంది లేఖ. ఇంతలో శైలబాల సుషమ్ననూ అన్నపూర్ణమ్మ గార్నీ తీసుకుని ఆ గదిలో కొచ్చింది.

"వచ్చావా సుషమ్నా! అని కుర్చీలోంచి దిగ్గున లేచి ప్రక్కనున్న ఆవిణ్ణి చూడంగానే అయిష్టంగా మళ్ళీ కూలబడింది — తప్పకుండా నాకు జడేయించటం కోసమే ఈవిణ్ణి తీసుకొచ్చివుంటుం దీ సుషమ్న," అనుకుంటూ సీరియస్‌గా చూసింది సుషమ్నవైపు.

"లేవమ్మా పెళ్ళికూతురా! అవతల ఆయన యెదురుచూస్తున్నాడు," అంటూ లేఖ చెయ్యి పుచ్చుకుంది సుషమ్న.

"కురే — ఆయన హృదయమే 'నే తాళ లేనే' అని గోలపెడుతూ ఉండి వుంటుంది," స్వానుభవాన్ని పురస్క—

రించుకుని అంటూ, శైలబాలకూడా రెండవచెయ్యి పుచ్చుకుంది.

"సంతోషించాంగానీ చేతులు వదలండి; నేను రాగలను. అంటూ చిరాగ్గా ముందువరండాలోకి వచ్చింది లేఖ – తీరా చూస్తే అక్కడ కూర్చున్న దెవరు? ఎవరూ – విద్యాసాగర్, కిశోర్, మరో ముసలాయనా. కళ్ళు నులుముకుని మళ్ళీ చూసింది. నిజమే – కిశోర్ ఆమెవైపు చూసి మందహాసం చేశాడు – ముసలాయన విద్యుల్లేఖ నొకసారి పరిశీలనగా చూసి, బావుంది – పేరుకు తగినపిల్లే," నంటూ సంతృప్తిపడ్డాడు.

"మా అబ్బాయి మొదట్నుంచీ పిల్లను చూడక్కర్లే దంటూనే వున్నాడు. ఆఁ – అన్ని విషయాలూ నచ్చినట్టే – ఆఁ – అబ్బాయ్ ఏమంటావ్?" అంటూ కిశోర్ వైపు తిరిగా డాయన.

"అంతా బాగానే వుందండీ. కానీ కట్నం సంగతే. వీరు పాతికవే లిస్తామంటున్నారు. యాభైవేలకు తక్కువ తీసుకోదలుచుకోలేదు నేను," అన్నాడు కిశోర్ కొనకంట విద్యుల్లేఖను చూస్తూ.

డబ్బు విషయం తర్వాత చూసుకుందాం; ముందు పిల్ల నచ్చినట్లేగదా – అమ్మాయికికూడా ఇష్టమే నంటున్నాడుగా మా సాగరం – ఇహ కుదిరిపోయినట్లే." నవ్వాడు పట్టాభిరామయ్యగారు సంతోషంతో.

"ఊఁహూఁ – కుదురనట్లే – నాకు ఆయన నచ్చలేదు." అనేసి గిరుక్కున వెనక్కు తిరిగి తనగదిలోకి వెళ్ళిపోయింది లేఖ – వెళ్ళేటప్పుడు కిశోర్ వేపుకే చూడలేదు. కిశోరు హృదయం ఆనందంతో ఉజ్వలమైంది.

సాగర్ అతనివైపు చూసి "చూశావా కిశోర్! తన ఆశయానికి పీసమెత్తు భంగం వచ్చినా సహించదు మా లేఖ. ఏ విషయంలోనూ నీకు తీసిపోదని ఋజువైంది గదా! ఇహపద లోపలికి. మా లేఖకు సంజాయిషీ యిచ్చుకో," అంటూ కిశోరుని విద్యుల్లేఖ గదిదగ్గిరికి తీసుకెళ్ళాడు.

కాబోయే వియ్యంకు లిద్దరూ ఈ విషయమే గమనించకుండా పెళ్ళి మాటలలో పడిపోయారు.

విద్యుల్లేఖను తీవ్రంగా మందలిస్తోంది సుషమ్న. దనలక్షమ్మ "ఇహ ఈ జన్మకు పెళ్ళిచేసుకోవుటే తల్లీ! అంతా మాఖర్మ. రత్నంలా పిల్లవాడుంటే నచ్చలేదంటావేమిటీ." అని కళ్ళనీళ్ళు పెట్టుకుంటోంది.

ఈ హడావుడి అంతా వింటూ గది గుమ్మందగ్గిరే నిలబడిపోయారు సాగర్ కిశోర్ లు.

ఇంతలో శైలబాల గబగబా లోపలికి వెళ్ళి "అత్తయ్యా! నిన్ను మీ వియ్యపురాలు – అన్నపూర్ణమ్మగారు రమ్మంటోంది. వాకిట్లో వుం దావిడ," అంటూ అవతలివేపు వాకిట్లోంచి ధనలక్షమ్మను తీసుకెళ్ళింది.

"అన్నట్టు మీవాళ్ళకు కాఫీ టిఫిన్లేనా పంపిస్తాను లోపలికి వెళ్ళు." అంటూ వెళ్ళిపోయాడు సాగర్.

"నామాట విను లేఖా ! ఈ మంకు పట్టు నీకు మంచిదికాదు; కిశోర్ లాంటి వీరుడు మళ్ళా దొరకడు – కట్నానికి భయపడి పెళ్ళి మానేయడానికి మన కేం ఖర్మం అసలు? యాభై వేలుకాదు ఎనభై వేలిస్తారు మీనాన్న. చెప్పు లేఖా ! నీకు కిశోర్ అంటే ఇష్టం లేదూ ? నా ముఖం చూసి చెప్పు – అతను నీకు నచ్చ లేదా ?" సుషుమ్న శక్తివంచన లేకుండా హితబోధ చేస్తోంది.

"సుషుమ్నా !" గర్జించింది విద్యుల్లేఖ. ఇహ నా కేం చెప్పద్దు. డబ్బు ఉంది గనక కట్నమిచ్చి పెళ్ళిచేసుకుని సుఖపడే హక్కు నా కుందన్నమాట. బీదవాళ్ళైన కన్యలు జీవితానందాన్ని పొందటానికి అనర్హులు – అదేగా నువ్వు చెప్పేది – ఎందుకంటే వాళ్ళు కట్న మిచ్చుకోలేరు మరి. బ్రహ్మరుద్రాదులు దిగివచ్చినా సరే నేను డబ్బిచ్చి వరుణ్ణి కొనుక్కోను. ఆజన్మబ్రహ్మచర్యమైనా చేస్తానుగానీ – హుం" – కోపావేశంతో ఆమె ముఖమూ పెదవులూ వణికిపోతున్నాయి. 'ఈ కిశోర్ యెంత మోసగాడు – ఎంత దగా

కోరు' అని మనసులో ఇందాకట్నించీ ఒకటే తపనగా వుం దామెకు.

"అఁ - అఁ - పిలిచా రాఁవచ్చేవచ్చే"- నిజంగా అవతల లెవరో పిలుస్తున్నట్లే గబ గబా వెళ్ళిపోయింది సుషమ్న.

ఇది సంకేతంగా భావించి లోపలికి వచ్చాడు కిశోర్. "గుడ్ లేఖా ! నిన్నభి నందిస్తున్నాను. నమ్మిన ఉత్తమ సిద్ధాంతంకోసం నన్నే తిరస్కరించ గలిగావు. అసలు తమాషా ఏమిటో తెలుసా ? ఇది నీకో పరీక్ష. నీ దృఢ సంకల్పాన్ని పరీక్షించడంకోసం ఆడిన అంతర్నాటకం. ఇందులోగనక నువ్వు గెలవకపోతే-అంటే నామీది యిష్టంకొద్దీ నువ్వు కట్నమివ్వటానికే ఒప్పుకుంటే నిన్ను చేసుకోవటానికి ఒప్పుకునేవాణ్ణి కాదు నేను. ఈ నాటకానికి సుషమ్నగారు సూత్రధారిణి. ఆడపిల్లల్లో నూటికి పది మందిచొప్పున నీలాంటివా ళ్ళుంటే ఈ కట్నాలసమస్య నిమిషాలమీద నశించి పోతుంది. ఊఁ, నా ప్రతిజ్ఞ నెరవేర్చు కోవడం అయిందమ్మాయ్ ! ఇప్పుడు చెప్పుమరి. నా కేమిస్తావ్ ?'' అన్నాడు. అతని పెదవుల నాశ్రయించుకుని ఎప్పటి చిరునవ్వే వెలుగులీనుతోంది.

చకితురాలై నిలబడిపోయింది లేఖ. వెంటనే తేరుకుని నమ్మలేనట్లు చూసింది.

ఇంకా అపనమ్మకం దేనికీ ? నే నిక్కడే వుంటానుగానీ నువ్వెళ్ళి సుషమ్నా సాగర్ శైలగార్లలో ఎవ్వరి నైనాసరే అడిగిరా - సామాన్యులు కాదు బాబూ మీవాళ్ళు. నీకు పెళ్ళి చెయ్యడానికి అద్భుతమైన నాటకం ఆడారుట. నాకూ తెలీ దసలు. నిన్ననే చెప్పాడు సాగర్. నేను ఊరుకోవడ మెందుకని అంతర్నా టకం ఆడాను. అసలు నాటకానికి ప్రాతి పదిక వేసింది శైలబాలా సంప త్కుమార్‌లు - రక్తికట్టించింది సుషమ్నా సాగర్‌లు - చివరికి ముఖ్య ఫలం సాధించిందేమో మన మిద్దర మూనూ. ఆ నలుగురు పుణ్యాత్ము లకూ మనం ఆజన్మాంతం ఋణపడి ఉండాల్సిందే. కట్నం పుచ్చుకోకూడదని నాకు సిద్ధాంత ముంది. అబ్బ ! ఎంత మందిని పెళ్ళిచూపులు చూశానో లెక్క లేదు. అందరూ నేను పెట్టిన పరీక్షలో తప్పిపోవడమే. నాకు భయమేసింది తెలుసా - ఇక మా అమ్మకు అర్హురాలైన కోడలు దొరకదేమో అని నా పూర్వ పుణ్యంచేత భాగ్యదేవతవు నువ్వు సాక్షా త్కరించావు - నువ్వేగెలిచావులే మొత్తా నికి. ఇంతకూ ఆ రోజు నీకు పూలజడ వేసి, నీ అలంకరణ చూసి మురిసిపోతూ మా అమ్మ నిన్ను ఆశీర్వదించిందిటగదా - ఆ ఆశీర్వాదఫలమే నీ గెలుపు. మాటల్లో పడి అసలుసంగత మరిచిపోతున్నాను. ఏదీ నా బహుమతి ?" అంటూ చెయ్యి చాపాడు కిశోర్.

విస్ఫారిత నేత్రాలతో అతని విశాల హృదయంమీద చూపు లనే నల్లకలువల

మాల అలంకరిస్తూ "మీరే చెప్పారుగా దాసోహం అనమని. నన్ను నేను సమర్పించుకుంటున్నాను. ఇంతకంటే మీ సహృదయానికేం బహుమానం యిచ్చుకోగలను. మగవాళ్ళల్లో నూటికి ఒక్కరైనా మీలాంటివాళ్ళుంటే ఈ ఘోర వరకట్న పిశాచం ఇంత తీవ్రంగా తాండవం చేసేది కాదు. ఎన్ని వేలమందికో మీ రాకకున్నారు—కట్నం తీసుకోకూడదనే సిద్ధాంతమున్న ఉత్తమ విద్యావంతులు. మిమ్మల్ని తప్పుగా అర్థం చేసుకున్నాను. క్షమించరూ నన్ను?" అమాయకంగా, ముగ్ధంగా అడిగింది విద్యుల్లేఖాకుమారి.

"నాకో చిన్న బహుమతి యివ్వవోయ్." అంటే ఇంతపెద్ద ఉపన్యాసం యిచ్చావేమిటీ? నాకేం అక్కర్లేదు ఈ ఉత్తుత్తి మాటలన్నీ."

"మరేం కావాలండీ బాబూ!"

"అడిగింది యిస్తావా మరి."

'ఆ—కట్నంతప్ప యేదైనాసరే;'—ఊఁ చెప్పండిమరి."

"................"

"ఛీ—పొండి..." సిగ్గుపడిపోయి ఏంచెయ్యాలో తెలీక అతని వక్షస్థలంలో తల దాచుకుంది విద్యుల్లేఖ.